జాతీయస్థాయిలో గుర్తింపు పొంది..

2018 అక్టోబర్ 2న తిరుపతిలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. అమలులో కఠిన చర్యలకు ఉపక్రమించారు. తరువాత క్రమంగా ఆశయం నీరుగారిపోయింది. పరిమిత సంఖ్యలోని హోటళ్లలో మాత్రమే అరటాకు భోజనం ఆకట్టుకుంటోంది. మరికొందరు ఫలహారాలకు విస్తరాకులు వినియోగిస్తున్నారు.

ఐదేళ్లూ ఆ ఆలోచనే లేదు

ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ప్రమాదకర స్థాయికి చేరింది. హోటళ్లలో దోపిడీ తప్ప ప్రజారోగ్యం గురించి ఆలోచించే పరిస్థితి కనిపించడం లేదు. ఎవరికైనా జరిమానాలు విధించాలన్నా గత పాలకులు అడ్డుపడటంతో వ్యవస్థ పూర్తిగా దారితప్పింది.



2 నిత్యం టన్నుల వాడకం

నగరంలో ప్లాస్టిక్ ఎక్కువగా వినియోగించేది చిరు వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు. నిత్యం రెండు టన్నుల పైగా ప్లాస్టిక్‌ను వివిధ రూపాల్లో వినియోగిస్తున్నట్లు అంచనా.

- పార్సిళ్లలో విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్
- ఆధ్యాత్మిక నగరిలో అమలుకాని నిబంధనలు

ఆహారం కొంటున్నాం.. ప్లాస్టిక్ తింటున్నాం

అరే.. ఎంత బాగుంది అనిపించింది.. మనిషి ప్రతి అవసరంలో ఇట్టే అతుక్కు పోయింది. ఉదయం వేడివేడిగా తాగే టీ మొదలు ఫలహారం, భోజనాలు, స్నాక్స్ ఇలా ప్రతి ఆహారంలో కలగలిసి పోతోంది. శ్రుతిమించిన వినియోగంతో మనలో అణువణువూ చేరిపోయి ఆరోగ్యాన్ని మడతపెడుతోంది. ఆహార పదార్థాల పార్సిళ్లలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోవడం, తిరుపతి వంటి ఆధ్యాత్మిక నగరంలో నిబంధనలు అమలు కాకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

- న్యూస్‌టుడే, తిరుపతి (నగరపాలిక)

తిరుపతి నగరంలో నిత్యం స్థానికులతో పాటు లక్షలాది మంది భక్తులు, యాత్రికుల సందడి ఉంటుంది. ఇక్కడ రెండు వందలకు పైగా అధికారిక, మరో 500 పైగా అనధికారిక హోటళ్లు, మెస్‌లు, అల్పాహార కేంద్రాలు ఉండగా ఏ అర్ధరాత్రి చూసినా కొన్నిచోట్ల కిటకిటలాడుతుంటాయి.

తిరుపతిలోని 90 శాతం హోటళ్లలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. వేడివేడి టీ, పాలు, సాంబార్ వంటివాటిని చిన్నపాటి మందం గల కవర్లలోనే పోసి పార్సిల్ ఇచ్చేస్తున్నారు. పొంగల్, ఉప్మా, దోశ ఇలా ప్రతిదానికీ న్యూస్‌పేపర్ పైన ప్లాస్టిక్ పరిచి ప్యాక్ చేసి ఇస్తున్నారు. మధ్యాహ్నం భోజనం, బిరియాని వంటి ఏ ఆహారమైనా ఎంత వేడిగా ఉన్నా ఎవరూ ఆలోచించట్లేదు. పేపరు ప్లేట్ల పేరుతో ప్లాస్టిక్ పూత కలిగిన వాటిని వినియోగిస్తున్నారు. ఇది సులువుగా ఆహారంలో కలిసిపోతుంది.

వ్యాధుల ముప్పు

వంద సెల్సియస్ డిగ్రీలకు మించి వేడిగా ఉన్న ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లపైన వేయగానే సహజంగా ప్లాస్టిక్ కరిగి రసాయనాలు విడుదలవుతాయి. ఆహారంతో కలగలసి పేగుల్లో చేరి క్యాన్సర్ వంటి భయానక వ్యాధులకు కారణమవుతాయి. చిన్నారుల్లో ఎదుగుదల సమస్య, హార్మోన్ల సమతుల్యతకు ప్లాస్టిక్‌లోని రసాయనాలే కారణమని నిపుణులు చెబుతున్నారు. చర్మవ్యాధులు, థైరాయిడ్ వంటి అనారోగ్య సమస్యలు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

80 వేల మంది

తిరుపతిలో సగటున పూటకు 27,000 మంది హోటళ్లు, రెస్టారెంట్‌లు, మెస్‌లు, తోపుడుబండ్లపై ఆహారం తింటున్నారు. మూడు పూటలకుగాను సుమారు 80 వేలమంది ఆహారాన్ని తీసుకుంటున్నట్లు అంచనా. ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్ల వాడకంతో వీరి ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. తిరుపతి పరిసరాల్లోని పరిశ్రమల్లో నిషేధిత ప్లాస్టిక్ తయారవుతున్నా.. పట్టించుకునే దిక్కులేదు. అరటి ఆకులకు రూపాయి నుంచి రూ.2.50 వరకు వ్యయం చేయాల్సి రావడంతో చౌకగా దొరికే ప్లాస్టిక్ వైపు మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసే కూరలు, టీ, ఇతర ఆహార పదార్థాలు క్రమంతప్పకుండా వాడితే ముప్పు తప్పదు. ప్రజల్లోనూ మార్పు రావాల్సి అవసరం ఉంది. కమిషనర్ ఎన్. మౌర్య ప్లాస్టిక్ ఉల్లంఘనలపై క్రమం తప్పకుండా దాడులు నిర్వహించాలని ఆదేశించారు.

- డా.అన్వేష్‌రెడ్డి, వైద్యాధికారి, నగరపాలిక

సొంత జాగీరులా.. డీసీసీబీ

- గత పాలకవర్గంలో ఇష్టారాజ్యం
- రుణాల మంజూరు, నియామకాల్లో అక్రమాలెన్నో

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సొంత జాగీరులా వాడుకున్న పాలవకర్గం.. రుణాల మంజూరు నుంచి ఉద్యోగాల నియామకాల్లో చేతివాటం చూపి అందినకాడికి దోచుకుంది. విశ్రాంత ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించడానికి సైతం 'అమ్మాయ్యా'లు తీసుకుని.. డీసీసీబీ ప్రతిష్ఠ దిగజారేలా వ్యవహరించారు. వైతు సేవలో తరించాల్సిన బ్యాంకును స్వార్థప్రయోజనాలకు వాడుకొన్నారు.

ఎన్నికలు నిర్వహించకుండానే..

నామినేటెడ్ కమిటీతో ఐదేళ్లూ కొనసాగించారు. పాలకవర్గాన్ని సైతం ఏడుగురు సభ్యులున్న కమిటీతోనే మమ అనిపించారు. జిల్లాకు చెందిన 'పెద్దరెడ్డి' అండ పుష్కలంగా ఉండటంతో మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మను డీసీసీబీ ఛైర్‌పర్సన్‌గా నియమించారు. దాదాపు రూ.3వేల కోట్ల వ్యాపార లావాదేవీలు కలిగి జిల్లాలో 40 శాఖలు, 75 ప్యాక్స్‌లు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. సహకార రంగంలో భారీస్థాయిలో లావాదేవీలు కలిగిన బ్యాంకులో అక్రమాలకు పాల్పడ్డారు.

నియామకాల్లోనూ వసూళ్లు

డీసీసీబీ పరిధిలో రెగ్యులర్ ప్రాతిపదికన స్టాఫ్ అసిస్టెంట్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు 50 మంజూరయ్యాయి. వీటి నియామకాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగుల నుంచి రూ.10 -15 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఉద్యోగాల భర్తీలో సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కొంతమేర అవకాశం కల్పించాలి. ఇదే అదనుగా వారి నుంచి వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. పొరుగు సేవలపై పనిచేస్తున్నట్లు ఇద్దరిని చూపి ఐదేళ్ల పాటు జీతాలు డ్రా చేసినట్లు సమాచారం

వైకాపా నాయకులకే అన్నీ..

ఛైర్‌పర్సన్‌గా రెడ్డెమ్మ ఉండగా పనుల్ని చక్కబెట్టేది మాత్రం ఆమె భర్త, వైకాపా నేత కృష్ణమూర్తి. పాలకవర్గం, సర్వసభ్య సమావేశాల్లో ఆయనే అంతా తానే నడిపించారు. జిల్లాలో పశ్చిమ మండలాల్లోని వైకాపా నాయకులకు పరిమితికి మించి ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రుణాలు మంజూరు చేసినట్లు ఆరోపణలున్నాయి. పాలకవర్గ సభ్యులు సైతం బినామీల పేర్లతో రుణాలు పొందారు.

విశ్రాంత ఉద్యోగుల్ని వదలని వైనం

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు విడుదల చేయడానికి 200 మంది నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. డీసీసీబీతో సంబంధం లేని ఓ జడ్పీ ఉద్యోగిని బ్యాంకు ఛైర్‌పర్సన్ పీఏగా నియమించుకున్నారు. ఆయనే ఈ అక్రమ వసూళ్లన్నీ చేశారని పాలకవర్గం సభ్యులే ఆరోపిస్తున్నారు. సదరు ఉద్యోగి సైతం అధికారుల్ని సైతం శాసిస్తూ.. వైకాపా నేత కృష్ణమూర్తికి వసూళ్ల ఏజెంటుగా పనిచేశారని తెలిసింది.

3 నుంచి కాణిపాకంలో

శరన్నవరాత్రి ఉత్సవాలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన శ్రీ మరగదాంబికా సమేత మణికంఠేశ్వర స్వామి వారి ఆలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. గురుప్రసాద్ తెలిపారు. సాయంత్రం అమ్మవారి అలంకారం, రాత్రి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 3న సరస్వతీదేవి అలంకారం, 4న లక్ష్మీదేవి, 5న రాజరాజేశ్వరి, 6న కంభాదేవి, 7న గాయత్రీదేవి, 8న అన్నపూర్ణ, 9న కాత్యాయని, 10న బాలత్రిపురసుందరి, 11న దుర్గాదేవి, 12న విజయదశమి, మహిషాసురమర్థని, శమీ పూజలు జరుగుతాయని తెలిపారు.

అక్టోబరు పింఛన్ల మంజూరు

2,69,677 మందికి రూ.113.77 కోట్లు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అక్టోబరులో పంపిణీ చేయనున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరయ్యాయి. జిల్లాలో మొత్తం 2,69,677 మందికి రూ.113.77 కోట్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబరు 1, 3 వ తేదీల్లో మాత్రమే పింఛన్లు పంపిణీ చేస్తారని, అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో పంపిణీ ఉండబోదని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఇంటి వద్దనే ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ చేస్తారని వెల్లడించారు. వృద్ధాప్య 1,42,664, వితంతు 59,772, గీత కార్మికులు 2463, దివ్యాంగులు 35,559, అభయహస్తం 11,407, గీత కార్మికులు 559, హిజ్రాలు 32, ఒంటరి మహిళలు 5735, మత్స్యకారులు 248, డప్పు కళాకారులు 6,244, చర్మకారులు 790, డయాలసిస్ రోగులు 574, సైనిక సంక్షేమ పింఛన్లు 57, చిత్ర కళాకారులు 70, ఆర్థ్ర పింఛన్లు 800, డీఎంహెచ్‌వో పింఛన్లు 2,703 ఉన్నాయి.

నేటి నుంచి..

అపార్

తిరుపతి (బైరాగివట్టెడ), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) సంఖ్య నమోదు ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇక నుంచి ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేక ఐడీ ఇవ్వనున్నారు. ఇది విద్యార్థికి శాశ్వతంగా ఉంటుంది. పాఠశాల మారినా వర్తిస్తుంది. విద్యార్థులకు సోమవారం నుంచి అపార్ సమ్మతి పత్రాలు అందించనున్నారు. వారు విద్యార్థుల ఫొటోలను జతపరిచి తల్లిదండ్రుల సంతకాలతో కూడిన ఆధార పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. దరఖాస్తులో పూరించిన అంశాలను గోప్యంగా ఉంచనున్నారు. అక్టోబర్ 14న పెద్దఎత్తున తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించనున్నారు.

శ్రీవారికి పరదాల తయారీ

తిరుపతి (బైరాగివట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన శ్రీవారి భక్తుడు పరదాల మణి శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా పరదాలు, కురాళాలు తయారు చేశారు. సోమవారం నడక మార్గం ద్వారా తిరుమల చేరుకొని మంగళవారం వీటిని తితిదే అధికారులకు ఆయన అందించనున్నారు. 27 సంవత్సరాలుగా ఆయన వరుసగా ఉగాది ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాల సమయాల్లో శ్రీవారికి అవసరమైన పరదాలు, కురాళాలు సమర్పిస్తున్నారు.

శ్రీవారి చిత్రపటాన్ని పరదాలో అందంగా అమర్చిన మణి

'రెస్కో' గుట్టు రట్టయ్యేనా..!

నెలలు గడిచినా కొలిక్కిరాని అవినీతి నివేదిక

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం గ్రామీణ విద్యుద్దీకరణ సంస్థ (రెస్కో) అక్రమాలపై విచారణ ఎంతకూ కొలిక్కి రావడం లేదు. 1980లో సంస్థను స్థాపించగా 1,32,629 సర్వీసులతో అంచెలంచెలుగా ఎదిగి ఎంతోమందికి ఉపాధి కల్పించిన సంస్థ, ఐదేళ్ల వైకాపా పాలనలో చీకట్లో కూరుకుపోయింది. కూటమి ప్రభుత్వం రాకతో విచారణ మొదలైనా ఆశించిన వేగం కరవైంది.

విచారణ జరిగిందిలా..

కుప్పం రెస్కోలో అక్రమంగా 19 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై అసిస్టెంట్ డీసీవో జూన్ 14న విచారణకు వచ్చారు. జేసీ నివేదిక అనంతరం ఐదేళ్ల వైకాపా పాలనలో ఉద్యోగాలు, క్రమబద్ధీకరణ అయిన 127 మంది సిబ్బందికి శాంతిపురం ఉపకేంద్రంలో వివిధ పరీక్షలు నిర్వహించారు. వీటిలో అధిక శాతం మంది అర్హత సాధించలేదు. వైకాపా పాలనలో ఉద్యోగాలు సాధించిన 115 మందితోపాటు

విచారణ చేపడుతున్న విచారణాధికారిణి శ్రీలక్ష్మి (పాతచిత్రం)

గతంలో మీటరు రీడర్లుగా ఉన్న 17 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. రెస్కో అవినీతి సమగ్ర విచారణకు సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. ఈ విషయమై జులై 11న రెస్కో ఎండీకి 30 అంశాలతో కూడిన నివేదిక సిద్ధం చేయాలని ఆమె సమన్లు జారీ చేశారు. జులై 18న ఆమె రెస్కోలో తనిఖీ చేసి, పలు రికార్డులు వెంట తీసుకెళ్లారు. గతనెల 29న మరోసారి రెస్కో అధికారులను విచారించారు.

ఫిర్యాదు.. కేసుల నమోదు

డీజిల్ అవకతవకలపై మాజీ ఛైర్మన్ జి.ఎస్. సెంథిల్‌కుమార్‌తో పాటు అప్పటి ఎండీ సుబ్రహ్మణ్యం, రెస్కో ఉద్యోగి కృష్ణమూర్తిపై కేసు నమోదైంది. ఈనెల 2న సెంథిల్ కుమార్‌ను రిమాండుకు తరలించారు. అక్రమ పదోన్నతులపై మరోసారి మాజీ ఛైర్మన్‌తో పాటు మాజీ ఎండీ, ఉద్యోగి కృష్ణమూర్తిపై కేసు నమోదైంది.

నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తాం

రెస్కోలో సహకార సంఘం నిబంధనలు పాటించక ఉద్యోగాల్లో చేరిన వారికి గతనెలలో షోకాజ్ నోటీసులు ఇచ్చాం. వారి నుంచి వచ్చే సమాధానం, విచారణాధికారి నుంచి వచ్చే నివేదికను జేసీకి సమర్పిస్తాం.

- సోమశేఖర్, ఎండీ, రెస్కో

జిల్లా సమాచారం

- **77,366** మంజూరైన ఇళ్లు
- **46,510** పూర్తయినవి
- **1,082** పునాదుల దశలో
- **9,182** మధ్య స్థాయిలో
- **6,559** పైకప్పు వరకు గోడలు
- **6,328** మోల్డింగ్
- **7,705** మొదలుపెట్టని గృహాలు

గృహ సంకల్పం

పేదల కల సాకారం దిశగా | **ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి**

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణం ముందుకు సాగడం లేదు. పేదలకు మేలు చేస్తున్నామని ఆర్భాటపు ప్రకటనలు చేశారే తప్ప.. ఆచరణలో ఇళ్ల నిర్మాణం అంతంత మాత్రమే. నిలువనీడ లేనివారికి సొంతింటి కల నిర్మాణం సాకారమయ్యేలా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. దశలవారీగా వీటిని పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకెళుతోంది. గృహ నిర్మాణాల్లో లబ్ధిదారుల్ని భాగస్వాములను చేసి ఇళ్లను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి.

చిత్తూరు నగరంలోని బండపల్లె లేఅవుట్

మన ఇల్లు- మన గౌరవం

ప్రధాన ఆవాస్ యోజనలో పట్టణ పేదలకు గత ప్రభుత్వం సెంటు స్థలం కేటాయించింది. గ్రామీణ ప్రాంతంలో సెంటున్నర కేటాయించారు. ఇళ్ల పూర్తికాకపోతే నిధులకు అవరోధం ఏర్పడే అవకాశం ఉంది. దీంతో 'మన ఇల్లు-మన గౌరవం' పేరుతో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే మార్చిలోగా లేఅవుట్లలో గృహ నిర్మాణాల్ని పూర్తిచేసేలా పనుల్ని వేగవంతం చేయిస్తున్నారు. ఇప్పటికే లేఅవుట్లలో లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నారు.

పూర్తికాకుంటే ఇబ్బంది

పీఎంఏవై 1.0 కింద ఇళ్లు తీసుకున్నవారికి మళ్లీ కేటాయించే అవకాశం ఉండదు. ఈ పరిస్థితుల్లో ఉన్న స్థలంలో ఇంటి పనులు పూర్తిచేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనుల్ని త్వరగా పూర్తిచేయాలని గృహనిర్మాణ అధికారులు అంటున్నారు.

18 మండలాల్లో వర్షం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో శనివారం రాత్రి జిల్లాలోని 18 మండలాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా వర్షపాతం వివరాలిలా.. చిత్తూరు రూరల్‌లో 28.6 మి.మీటర్లు, గంగాధర నెల్లూరు 23.4, పుంగనూరు 22.2, పులిచెర్ల 10.4, పెద్దపంజాణి 10.0 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.

ఇసుక.. భారం

- వాహనదారుల కొర్రీలు..
- రవాణాకు ఇక్కట్లు
- రిజిస్ట్రేషన్‌కు మక్కువ చూపని వైనం

వాహనాల్లో లోడ్ చేస్తున్న చిత్రం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానంలో రవాణాకు అవరోధాలు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో సాంకేతిక ఇబ్బందులు, రవాణాలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 85 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. చిత్తూరు గ్రామీణ మండలం పాలూరు, దిగువమాసాపల్లి వద్ద నిల్వ కేంద్రాలున్నాయి. అక్కడి నుంచి సరఫరా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంతాల వారు ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా అంత దూరానికి ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీలతో సరఫరా చేయలేమని వాహన యజమానులు చేతులెత్తేస్తున్నారు.

1,630 టన్నులే నమోదు.. ఇసుక కోసం ఆన్‌లైన్ విధానం ఈనెల 19వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినా సాంకేతికంగా కొన్ని సమస్యలు ఎదురవుతున్నట్లు గనులశాఖ అధికారులు చెబుతున్నారు. వాటిని సాంకేతిక బృందం సరిదిద్దుతున్నట్లు చెబుతున్నారు. ఆదివారం వరకూ 1630 టన్నుల ఇసుకకు ఆర్డర్ వచ్చినా రవాణా విషయంలో ఇబ్బంది తలెత్తుతోంది. ప్రభుత్వమే వాహనం సమకూర్చాల్సి వస్తే ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. జిల్లాలో వేలాది లారీలుండగా కనీసం పదుల సంఖ్యలో కూడా ముందుకు రాలేదని అధికారులే చెబుతున్నారు. దూరాన్ని బట్టి ధర లేకుండా అన్ని ప్రాంతాలకు ఒకేలా ఉండటం, జీపీఎస్ పరికరాలు ఉండాలని చెప్పడమే కారణమని చెబుతున్నారు.

రవాణా సంఘాలు ఏమంటున్నాయంటే.. లారీ కిరాయిపై విధించిన జీఎస్టీ డిపాజిట్ రద్దు, ప్రస్తుతం నిర్ణయించిన ధరకు 20 శాతం పెంచాలని లారీ యజమానుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. చర్యలు, కేసులు నమోదు విషయంలో కొన్నింటిని తొలగించి, సహకరించాలని కోరుతున్నారు. సమస్యలన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఓటర్లను 'దూరం' చేయాలనే..!

- గత ఎన్నికల్లో పూతల పట్టులో ఇష్టారాజ్యంగా పోలింగ్ కేంద్రాల మార్పు
- తాజా ప్రక్రియలో సరిదిద్దితేనే ఓటర్లకు అవస్థలు తప్పేది

ఈనాడు, చిత్తూరు: ఎక్కడైనా ఓటర్ల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల్లో మార్పులు చేర్పులు చేయాలి. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు వైకాపా నేతల అభీష్టానికి అనుగుణంగా ఇష్టారాజ్యంగా ఆ ప్రక్రియ చేపట్టారు. ప్రధానంగా పూతలపట్టు నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా ఈ తంతు జరిగింది. తెలుగుదేశం నాయకులు పలుమార్లు అధికారులకు విన్నవించినా బుట్టదాఖలు చేశారు. ఫలితంగా ఓటర్లు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడైనా గత తప్పిదాలు సరిదిద్దితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పుతాయి.

పూతలపట్టు మండలంలోని వడ్డిపల్లి పోలింగ్ కేంద్రం (పాతచిత్రం)

'పెద్దాయన' మాటలే వేదవాక్కుగా

2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్, వైకాపాలు పూతలపట్టు నియోజకవర్గంలో కేవలం వెయ్యి ఓట్ల తేడాతోనే గెలిచాయి. దీనికితోడు కొన్ని పంచాయతీల్లో ప్రతిసారీ తెలుగుదేశానికే ఆధిక్యం రావడం ఫ్యాను పార్టీ నేతలకు కంటగింపుగా మారింది. అదే పోలింగ్ బూత్‌లను దూరంలో ఏర్పాటు చేస్తే ఎంతోకొంత మెజార్టీ పెంచుకోవచ్చని 2024 ఎన్నికలకు ముందు భావించారు. ఇదే విషయాన్ని వైకాపాలోని 'పెద్దాయన' దృష్టికి నేతలు తీసుకెళ్లారు. ఆయన వెంటనే సంబంధిత ఆర్డీవోను ఆదేశించడం.. ఎక్కడెక్కడ మార్పులు చేయాలనే జాబితాను నాయకులు ఇవ్వడం చకచకా జరిగిపోయాయి.

అక్టోబరు 10 వరకు..

ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రక్రియ ప్రారంభించింది. ఆగస్టు 20 నుంచి బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఓటర్ల ఫొటోల మార్పు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు అక్టోబరు 10 వరకు అవకాశం ఉంది. నూతనంగా ఓటుహక్కు దరఖాస్తు వివరాలతో కలిపి అదేనెల 28లోగా ముసాయిదా జాబితా రూపొందిస్తారు. 29న వెలువడుతుంది. అందులో అభ్యంతరాలను నవంబరు 28 వరకు స్వీకరిస్తారు.

18 చోట్ల

పూతలపట్టు మండలంలోని కమ్మగుట్టపల్లిలో ఎన్నికలు జరిగితే తెలుగుదేశానికే ఆధిక్యం వస్తుంది. ఈ గ్రామాన్ని కాదని దూరంగా ఉన్న పేటపల్లికి బూత్ మార్చారు. ఇదే మండలం ఎర్రచెరువుపల్లిలో ప్రాథమిక పాఠశాలలోని బూత్‌ను ఏ సౌకర్యాలూ లేని అంగన్‌వాడీ కేంద్రానికి తరలించారు. బందార్లపల్లిలో కేంద్రం అందరికీ అందుబాటులో ఉండగా వడ్డిపల్లి రైతుభరోసా కేంద్రానికి మార్చారు. ఐరాల మండలం పేరయ్యగారిపల్లిలో దశాబ్దాలుగా ఉన్న బూత్‌ను ఎల్లంపల్లి ఎస్సీ కాలనీలో పెట్టారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా 18 పోలింగ్ కేంద్రాలను మార్చేశారు. దూరంగా కేంద్రాలు ఉన్నందున ఓటర్లు అవస్థలు పడ్డారు. రెండుమూడు కి.మీ. అదనంగా ప్రయాణించాల్సి వచ్చింది.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా తిరుమల వచ్చిన భక్తులకు 24 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 3 గంటలు పడుతోంది. శనివారం శ్రీవారిని 71,133 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.28 కోట్ల హుండీ కానుకలు లభించాయి.



(c) eenadu

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక

వడమాలపేట, న్యూస్‌టుడే: తిరుపతి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-14 బాలబాలికల ఫ్రీస్టైయిల్, అండర్ -17 బాలుర గ్రీకో రోమన్ రెజ్లింగ్ ఎంపిక పోటీలు వడమాలపేట ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 210 మంది క్రీడాకారులు హాజరయ్యారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు పర్యవేక్షించారు.

అండర్ 14 బాలికలు..: శ్రీవల్లి, భార్గవి, శైలజా, యశస్వి, వర్షిత, దీపిక (రేణిగుంట) గీతికగుణశ్రీ (వడమాలపేట), జ్యోతిర్మయి, ప్రణీత(ఎంజీఎం తిరుపతి)

అండర్ 14 బాలురు..: దేవేంద్ర, షణ్ముగం, యేగేశ్వర్ (వడమాలపేట) హర్షవర్ధన్, నాగరాజు (పల్లం), పవన్, సైపుల్లా, హూసేన్, గిరుబాబు (యాదమరి), సంతోష్ (ఎంజీఎం తిరుపతి)

అండర్ 17 బాలురు..: భానుప్రకాష్, సతీష్, విగ్నేష్, సంతోష్, ఉదయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, అనీష్ (వడమాలపేట), సూర్య మోహనాచారి (పల్లం), హర్షద్ (ఎంజీఎం తిరుపతి)

రూ.1.56 కోట్ల బకాయిల వసూలు

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఆదివారం విద్యుత్తు బిల్లుల వసూళ్ల కేంద్రాల ద్వారా ఒక్కరోజే రూ.1.56 కోట్లు వసూలైనట్లు విద్యుత్తు శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు తెలిపారు. 16,500 సర్వీసులకు సంబంధించిన వినియోగదారులు బిల్లులు చెల్లించారన్నారు. వంద శాతం బిల్లుల వసూళ్లకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆయన తెలిపారు.

పట్టుబడితే వదిలేయడమే..!

పలమనేరు, న్యూస్‌టుడే: తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అత్యంత సమీపంలో ఉన్న చిత్తూరు జిల్లాలో అక్రమ వ్యాపారాలు మమ్మురంగా సాగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ మద్యం విధానం వైఫల్యం చెందడంతో సమీపంలోని కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమ మద్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగేది. మన జిల్లాలోకి కర్ణాటక మద్యాన్ని తీసుకు వచ్చేందుకు ఉపయోగించే కార్లు, మోటారు సైకిళ్లు చాలా వరకు దొంగ వాహనాలు కావడం గమనార్హం. స్మగ్లర్లు చోరీ చేసుకొచ్చిన వాహనంలో మద్యం నింపుకొని తరలిస్తుంటారు. అధికారులు పట్టుకుంటే వదిలేసి పారిపోవడం.. లేదా వాహనం తమది కాదని చెప్పడం పరిపాటి. ఎక్సైజు, సివిల్ పోలీసులు ఈ వాహనాలను సీజ్ చేసి పోలీసు స్టేషన్ వద్ద ఉంచుతారు. ఐదు నెలల వ్యవధిలో ఆ వాహనం సొంతదారు వస్తే కోర్టు ద్వారా నిబంధనల ప్రకారం విడుదల చేస్తారు. సీజ్ చేసిన వాహనాలను క్లెయిమ్ చేసుకోడానికి 99 శాతం ఎవరూ రావడంలేదు. అలాంటప్పుడు వాటిని కోర్టు అనుమతితో వేలం వేస్తారు.

2024లో క్లెయిమ్‌కాని నాలుగు చక్రాల వాహనాలు..

జిల్లాలో ఉన్నవి	
ఎక్సైజు స్టేషన్ పరిధి	50
అటవీశాఖ	25
సివిల్ పోలీసు స్టేషన్	50

ప్రత్యేక ముఠా..

అక్రమ వ్యాపారాలు చేయడానికి ఉపయోగించే వాహనాలను సరఫరా చేయడానికి ఒక ప్రత్యేక ముఠా పనిచేస్తోంది. ఈ ముఠా సమీపంలోని తమిళనాడు రాష్ట్రం వేలూరు, గుడియాత్తం పట్టణాల్లో తన కార్యకలాపాలను రహస్యంగా నిర్వహిస్తుంటుంది. వీరు చోరీకి గురైన వాహనాలను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని తమ వద్ద భద్రపరుస్తారు. మద్యం, ఎర్రచందనం, బియ్యం రవాణా చేయడానికి వీటిని స్మగ్లర్లు కొనుగోలు చేస్తుంటారు. పట్టుపడితే వాహనాన్ని అందులోని సరకును వదిలేసి పారిపోతారు. అలా కాని పక్షంలో పోలీసులు వాహనాన్ని స్మగ్లర్‌కు ఎవరు విక్రయించారో తెలుసుకుని వారి మీద కేసు నమోదు చేస్తుంటారు. వాహనాన్ని విక్రయించిన ముఠా తమ నిజమైన చిరునామా తెలియకుండా జాగ్రత్త పడుతుంటారు. చోరీ చేసిన వాహనాలకు నంబర్లు ఒకటి ఉంటే చేసిన నంబరు మరొకటి ఉంటుంది. పోలీసులు మద్యం రవాణాతో పాటు దొంగ వాహనాలు విక్రయించే ముఠా మీద కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

దొంగ వాహనాల సరఫరాకు ప్రత్యేక ముఠా

అటవీశాఖ అధికారులు సీజ్ చేసిన వాహనాలు

వాహనాలు ఎవరివో గుర్తిస్తాం

దొంగ వాహనాలు కూడా అక్రమ రవాణాకు ఉపయోగిస్తుంటారు. అయితే వాహనాల చాసిస్ నంబరు ప్రకారం ఆర్టీవో సహకారంతో అసలు యజమానికి నోటీసులు ఇస్తాం. ఎవరూ రాని సమయంలో చట్టాన్ని అనుసరించి వేలం వేస్తుంటారు. సాధ్యమైనంత వరకు యజమానిని పట్టుకోడానికి ప్రయత్నిస్తాం.

- **సురేష్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, పలమనేరు**

హరియాణాలో బహుమతి అందుకుంటున్న రాష్ట్ర జట్టు

జాతీయ స్థాయిలో ప్రతిభ

నగరి,న్యూస్‌టుడే: హరియాణాలో జరిగిన జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర బాలుర జట్టు బంగారు పతకం సాధించింది. చిత్తూరు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ ఈ వివరాలు తెలిపారు. బాలుర జట్టు ప్రథమ, బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ఛాంపియన్‌గా నిలిచింది. జట్టుకు సారథ్యం వహించిన చిత్తూరు జిల్లా నగరికి చెందిన తేజేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి, 'స్టార్ ఆఫ్ ఇండియా' అవార్డు దక్కించుకున్నారు. వారిని అసోసియేషన్ అధ్యక్షుడు విజయశంకర్, ప్రధాన కార్యదర్శి వెంకటరావ్, జిల్లా అసోసియేషన్ ఛైర్మన్ జగన్నాథం నాయుడు, మేనేజర్ సూరిబాబు అభినందించారు.

ఎంపికైన క్రీడాకారులతో శిక్షకులు

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ అండర్-14, 17 రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎస్.బాబు తెలిపారు. ఆదివారం తిరుపతి వేదికగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వచ్చే నెలలో కాకినాడ వేదికగా జరుగనున్న పోటీలో పాల్గొంటారని వివరించారు. శిక్షకులు శ్రీమన్నారాయణ, గణేష్, సురేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సాలయంగా పీఆర్వో కార్యాలయం

కాణిపాకం ఆలయం ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్సాలయం

శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయం సమీపంలో ప్రథమ చికిత్సాలయాన్ని నూతనంగా ఆదివారం ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పీఆర్వో కార్యాలయాన్ని అక్కడి నుంచి తొలగించారు. దాన్ని ప్రథమ చికిత్సాలయంగా మార్చి భక్తులకు అందుబాటులోని తీసుకొచ్చారు. పీఆర్వో కార్యాలయం ఆలయానికి సమీపంలో ఉండటం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో... దానిని ఈవో కార్యాలయానికి వెనుకభాగంలో ఉన్న అతిథిగృహం వద్దకు మార్పు చేశారు. - **కాణిపాకం, న్యూస్‌టుడే**

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195

డీఈవో పూల్ పండితులకు ఉద్యోగోన్నతి కల్పించాలి

మాట్లాడుతున్న డీఈవో పూల్ బాధితుల కన్వీనర్ సభాపతి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఈవో పూల్‌లోని భాషా పండితులకు ఉద్యోగోన్నతి కల్పించాలని బాధితుల కన్వీనర్ సభాపతి డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఆదివారం డీఈవో పూల్ (తెలుగు, హిందీ) బాధితుల సమావేశం నిర్వహించారు. ఐదేళ్లుగా కేడర్ లేక ఉద్యోగోన్నతులు కోల్పోతున్నామని, విద్యాశాఖ ఏటా బదిలీ, పాఠశాల సర్దుబాటు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం కన్వీనర్లు స్వామినాథ్, కిరణ్‌కుమార్, కమలనాథ్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐల బదిలీ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖలో సీఐలను బదిలీ చేస్తూ ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్సు టాస్క్‌ఫోర్సు, డిపోల సీఐలు బదిలీ అయ్యారు. చిత్తూరు అర్బన్, రూరల్ సీఐలుగా పి.శ్రీహరి, ఎ.పురుషోత్తం, నగరికి పి.టి.శ్రీనివాసరెడ్డి, కార్వేటినగరం డి.శిరీషాదేవి, పుంగనూరు కె.సురేష్‌రెడ్డి, పలమనేరు జి.భాగ్యలక్ష్మి, కుప్పం ఎ.నాగరాజు, పులిచెర్ల ఎ.మాధవస్వామిను కేటాయించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్సు విభాగానికి కె.మోహన్, ఏసీ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగానికి పి.జవహర్‌బాబు, వై.వి.పవన్‌కుమార్, కె.సత్యనారాయణ, ఐఎంఎల్ డిపోకు ఎం.రమణను కేటాయించారు.

వ్యవసాయశాఖ ఉద్యోగుల నూతన కార్యవర్గం

వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ (ఏపీఏఈఎస్ఏ) ఉమ్మడి చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఆదివారం స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షునిగా ఇ.అంజయ్య (సూపరింటెండెంట్, చిత్తూరు), అసోసియేట్ అధ్యక్షుడు టి.కె.రాజీవ్ (పుత్తూరు), ఉపాధ్యక్షులుగా ఎన్.దాము (పుంగనూరు), ఆర్.సురేష్‌కుమార్ (తిరుపతి), కె.చంద్రశేఖర్‌రాజు (వాల్మీకిపురం), కార్యదర్శిగా కె.బాలమురుగన్ (చిత్తూరు), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.లక్ష్మిప్రసాద్ (తిరుపతి), ఎన్.లత (చిత్తూరు), సంయుక్త కార్యదర్శులుగా కె.ఎస్.శంకర్, పి.కుమార్, ఎస్.అస్లాంబాషా, ఎన్.భానుప్రియ, కోశాధికారిగా ఎం.సాయిచరణ్, జిల్లా సభ్యునిగా విజయకుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్.వి.ప్రసాద్‌బాబు ఎన్నికయ్యారు.

చిత్తూరులో రాష్ట్ర విద్య వైజ్ఞానిక సదస్సు

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్-1938 నాయకులు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్-1938 ఎనభై వసంతాలు పూర్తయిన సందర్భంగా అక్టోబరు 6 నుంచి మూడురోజుల పాటు విజయనగరంలో విద్య వైజ్ఞానిక సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సమాఖ్య రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్రాయ మండడి తెలిపారు. స్థానిక బాపు బాలభవన్‌లో ఆదివారం విద్య, వైజ్ఞానిక సదస్సు జయప్రదం చేయాలని ముద్రించిన గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్-1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్, చిట్టిబాబు, నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో అరుదైన సాలీడు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శేషాచలం అడవిలో తరచూ అరుదైన జంతువులు, క్రిమికీటకాలు వెలుగుచూస్తూనే ఉంటాయి. ఇటీవల మారిషస్, రోడ్రిగస్ ఐలాండ్‌లో మాత్రమే దర్శనమిచ్చే 'రెడ్ లెగ్డ్ గోల్డెన్ ఆర్బ్ స్పైడర్' శేషాచలం అడవిలో కనిపించింది. భారీ ఆకారంతో ఉండే ఈ సాలీడు వృక్షాల మధ్య సాలెగూడు కట్టి నివాసం ఉంటుంది.

బధిరుల సంక్షేమానికి కృషి

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: బధిరుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని వివిధ్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక రాస్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ బధిరుల దినోత్సవం నిర్వహించారు. పర్యవేక్షకులు వినోద్ మాట్లాడుతూ అర్హులైన బధిరులు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కల్యాణ్ చక్రవర్తి, జనరల్ సెక్రటరీ రెడ్డప్పరెడ్డి, కోశాధికారి సుబ్బరాయుడు, మాధవ్, యువరాజ్, రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు

మొదలైన నీటి కష్టాలు

చుక్కనీరు లేని కుప్పం చెరువు

అమరావతి కాలనీలో నీటి కోసం ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: వరుణుడి కరుణ కరవై.. చెరువుల్లో నీరు ఇంకుతోంది. . బోర్లలో నీటి మట్టం తగ్గుతూ, మరమ్మతులకు గురవుతుండటంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. నియోజకవర్గంలో 565 చెరువులు ఉండగా రెండేళ్లుగా సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో పలు చెరువులు ఎండిపోయాయి. వర్షాలు కురిసినప్పుడు పొంగి పొర్లిన చెరువులు.. నీరు పారే కాలువలు నీటి జాడ లేక ఎడారిని తలపిస్తున్నాయి. కుప్పం పురపాలిక పరిధి 25 వార్డుల్లో 150 తాగునీటి బోర్లు ఉన్నాయి. 46,598 మంది జనాభా ఉండగా, ప్రతిరోజూ 3.7 ఎల్ఎండీ నీరు అవసరం కాగా 3.5 ఎల్ఎండీ నీరు సరఫరా లవుతోంది. అయినా ఇప్పటికీ పలు వీధుల్లో నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా సామగుట్టపల్లె, అమరావతి నగర్, మోడల్ కాలనీ, గెర్రిబాయి, నారాయణపురం తదితర ప్రాంతాల్లో నీటి సమస్య నెలకొంది. నీటి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జ్వరాలతో కిటకిట

పుత్తూరు పట్టణం మండీవీధిలోని ప్రైవేటు క్లినిక్‌లో రోగులు

పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో..

పుత్తూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో వైరల్, గన్యా జ్వరాలతో రోగులు కిటకిటలాడుతున్నారు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ 600 వరకు ఉంటోంది. అందులో అధిక శాతం జ్వర బాధితులే. పదుల సంఖ్యలో ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకుంటున్నారు. ఒక్క పుత్తూరులోనే కాదు జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో నిత్యం ఒక్కో 50 నుంచి 100 మంది రోగులు వచ్చి చికిత్సలు పొందుతుండడం గమనార్హం. జిల్లాలోని చిత్తూరు, నగరి, తిరుపతి, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రుల్లో వందల సంఖ్యలో జ్వర బాధితులు వైద్య సేవలు పొందుతున్నారు. 50 పడకలు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు జ్వర బాధితులతో నిండిపోతున్నాయి.

దోమల నివారణకు చర్యలేవీ?

గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులన్నీ పక్కదారి పట్టించారు. దీంతో పంచాయతీల్లో నిధులు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు గగనమయ్యాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీలకు నిధులు విడుదల చేయగా ప్రస్తుతం పారిశుద్ధ్య పనులు సాగుతున్నాయి. గతంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టకపోవడంతో దోమలు విజృంభించాయి.

జ్వరాలు అధికంగానే ఉన్నాయి

పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా జ్వరాలు అధికంగానే ఉన్నాయి. అవసరమైన మందులు ఉన్నాయి. జ్వర బాధితులు వచ్చిన వెంటనే డెంగీ, టైఫాయిడ్, మలేరియా, వైరల్ ఫీవర్‌కు సంబంధించి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- **కృష్ణకాంత్, సూపరింటెండెంట్, పుత్తూరు వైద్య విధాన పరిషత్తు**

ప్రసన్న వేంకన్న ఆలయంలో పవిత్రాల సమర్పణ

మాలలను ఊరేగింపుగా తీసుకువస్తున్న అర్చకులు

వడమాలపేట, న్యూస్‌టుడే: పవిత్రోత్సవాల్లో రెండో రోజు ఉదయం యాగశాలలో హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి తిరుమంజనం ఘనంగా అర్చకులు జరిపించారు. వేద ఘోష, మంగళవాయిద్యాల నడుమ ప్రసన్న వేంకన్న మూలవర్లు, ఆండాళ్లమ్మ, పద్మావతమ్మ, చక్రతాళ్వార్, గరుడాళ్వార్, ఆనంద నిలయం, పోటు, పరివార దేవతలకు, విష్వక్సేనుల, ధ్వజస్తంభం, బలిపీఠం, కోనేరు, ఆంజనేయస్వామికి పవిత్ర మాలలు సమర్పించారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాలు

తిరుపతి (బైరాగిపట్టెడ) : ఎస్వీయూలో ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలను ఆదివారం విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగ నియంత్రణ అధికారి దామ్లానాయక్ తెలిపారు. వివరాలను ఎస్వీయూ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు.

బాలకార్మిక, భిక్షాటన రహితంగా తిరుమల

తిరుమల: తిరుమలలో బాలకార్మికులు, భిక్షాటన లేకుండా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసిల అప్పారావు తెలిపారు. ఆదివారం సభ్యులు ఆదిలక్ష్మి, బత్తుల పద్మావతితో కలిసి తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్, హోటళ్లలో బాలకార్మికులను, భిక్షాటన చేస్తూ ఉన్న బాలలను గుర్తించారు. దుకాణాల యజమానులతో సమావేశమై బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ప్రయత్నించాలి

విజేతలతో వేలూరు వీఐటీ కులపతి డా.విశ్వనాథన్

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని పట్టుదలతో ప్రయత్నిస్తే జీవితంలో విజేతలుగా నిలుస్తారని వేలూరు వీఐటీ వర్సిటీ వ్యవస్థాపకులు, కులపతి డా.విశ్వనాథన్ అన్నారు. సిప్ మిరాకల్ -24, సిప్ అబాకస్ జోనల్ స్థాయి గణిత మేధ పోటీలు ఆదివారం చిత్తూరు నగరం కట్టమంచి లోచి సూర్యప్రతాప్ హాల్‌లో జరిగాయి. ఈ పోటీల్లో చిత్తూరు, తమిళనాడు వేలూరుకు చెందిన విద్యార్థులు 500 మందికిపైగా తలపడ్డారు. పోటీల్లో విజేతలకు విశ్వనాథన్ పతకాల్ని ప్రదానం చేశారు. విజేతలు త్వరలో కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తలపడతారని నిర్వాహకులు లత, మురళి తెలిపారు. 11 లెవల్స్‌ను పూర్తిచేసిన విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలు అందజేశారు.

పది రోజుల్లో భద్రతా ఏర్పాట్లు

ప్రమాదాల నివారణకు చర్యలు

సిబ్బందికి సూచనలిస్తున్న బాలాజీ

పలమనేరు, న్యూస్‌టుడే: మొగిలి ఘాట్‌లో నాలుగో నంబరు జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు మరో పది రోజుల్లో భద్రతా ఏర్పాట్లు పూర్తి చేస్తామని రోడ్ సేఫ్టీ అనలిస్టు బాలాజీ అన్నారు. ఆదివారం ఆయన వివిధ శాఖల అధికారులతో జాతీయ రహదారిలో సర్వే చేసి సూచనలను అందించారు. ఇందులో భాగంగా ఆయన మొగిలి ఘాట్‌లో అధికారులతో మాట్లాడుతూ ఘాట్ రోడ్డులో ఇటీవల తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఇందుకోసం తాను జాతీయ రహదారుల శాఖ ఇంజినీరింగ్ విభాగాన్ని ఈ సంఘటనలకు మొదటి ముద్దాయిని చేస్తూ కేసు పెట్టాలని అనుకుంటున్నానని చెప్పారు. కాగా ప్రమాదాలు నివారించడానికి సంఘటనా స్థలానికి 100 మీటర్ల దూరంలో రోడ్డుమీద స్పీడ్ సిగ్నల్ బోర్డులు, రేడియం స్ట్రిప్స్ మూడు చోట్ల వేయాలని సూచించారు. రోడ్డుకు అడ్డంగా వేయడంతో అవి రాత్రి సమయాల్లో కూడా డ్రైవర్‌కు కనిపిస్తాయని చెప్పారు. వాహనం దానిమీద వెళ్లిన సమయంలో కుదుపులు వచ్చి డ్రైవర్ అప్రమత్తం కావడానికి అవకాశం ఉందని అన్నారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్న మలుపు వద్ద డివైడర్‌పై ఇనుప తండువాలను (రైలు పట్టాలు) 3 అడుగుల ఎత్తులో అడ్డంగా ఏర్పాటు చేయాలని సూచించారు. అవి వాహనాలు ఒకవేళ డివైడర్‌ను దాటే సమయంలో అడ్డుకుంటాయన్నారు. డెడ్లి యాక్సిడెంటు జోన్ అనే పెద్ద బోర్డును ప్రమాదాలు జరిగే ప్రదేశానికి 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాలను తాను ప్రభుత్వానికి, సంబంధిత జాతీయ రహదారుల శాఖకు సిఫారసు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు, చిత్తూరు ఎంవీఐ రాజేశ్వరరావు, ఆర్టీసీ డీఎం టి.కె.స్వామి పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న 18 మంది అరెస్టు

గంగవరం, న్యూస్‌టుడే: కొత్తూరు అటవీప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్న వారిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. అర్బన్ సీఐ ప్రసాద్ కథనం మేరకు... ఎం.కొత్తూరు అటవీ ప్రాంతంలో కోడిపందేలు జరుగుతున్నాయని పక్కా సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. 18 మందిని అరెస్ట్ చేసి 19 పందెం కోళ్లు, 11 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి రూ.24 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

EENADU eClassifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

షాప్స్ పర్ సేల్: నేషనల్ హైవేకి ఆనుకొని IISER వెనుక వైపు ఫైనల్ ఆఫ్రూవ్డ్ ప్లాట్లు అన్ని సదుపాయాలతో తక్కువ ధరకే డైరెక్ట్ ఓనర్ : ✆ 95027 74175, 74162 11984.

గూడూరు నుండి 7 కి.మీ.లో వెంకటగిరి మెయిన్ రోడ్, మ్యాంగో ఫామ్ ల్యాండ్ 10 సెంట్లు 15 లక్షలు, ఆం|| రేట్ : 25 వేలు, 60 అం||లు 15 లక్షలు, స్పాట్ రిజిస్ట్రేషన్, 16 గ్రా|| గోల్డ్ దసరా ఆఫర్. ✆ 80086 15946

తిరుపతి RTC బస్టాండ్ నుండి కేవలం 6KMలో పలు కార్పొరేట్ ఆకర్ష - డిల్లీ పబ్లిక్ స్కూల్స్, శ్రీ చైతన్య - ఎమర్జెన్సీ కాలేజ్, CPR - Signature విల్లాస్ ప్రముఖ VERITAS SAINIK SCHOOL దాటగానే C. రామాపురం వద్ద 150 Feets రోడ్‌పై ఆసుకున్న మా Phase-1 మెగా Phase-2 TUDA అఫ్రూవ్డ్ లేఔట్ నందు అభివృద్ధి చేస్తున్న శ్రీ పద్మావతి లీలాకృష్ణ గార్డెన్స్ లేఔట్‌లో Plots అమ్మకమునకు కలవు. సంప్ర: ✆ 73861 43336.

తిరుపతి - తిరుమూరు 8లైన్స్ హైవేకు గల TOYOTA Showroom ఎదురుగా తిరుపతి TUDA వారు అభివృద్ధి చేస్తున్న TUDA లేఔట్‌కు వెళ్లే 200 Feets దారిలో రోడ్డుకు ఆసుకొని All Developments తో నూతన మెగా అఫ్రూవల్ లేఔట్ సూర్యప్ర కళం నందు 60x33 కొలతల వెస్ట్‌ఫేసింగ్ గల 100% వాస్తుతో 2 Plots మాత్రమే అమ్మకమునకు కలవు. సంప్ర. ✆ 90100 22254.

తిరుపతి - రేణిగుంట Whitefield Venture తుడ అఫ్రూవల్ లేఔట్ నందు తూర్పుముఖం 1917 Sq.ft కొలత గల Plot అమ్మబడును. Ph.No: ✆ 73374 16523.

WANTED

GENERAL

WANTED: 4 or 5 Bedroom East/ North Facing Villa/ Individual House for Rent Purpose in Tirupati for a Business Family. Contact: 90102 03671.

TO LET

WANTED

పీలేరు, కల్లూరు, దామలచెరువు, కలికిరి ఏరియాలలో స్కూల్ కొరకు ఇండిపెండెంట్ హౌస్ / బిల్డింగ్ అద్దెకు / లీజుకు కావలెను. సంప్రదించండి. ✆ 90082 15280

JOBS

WANTED MARKETING MANAGER -(6) Qua: MBA, Fresher/ Any Marketing Experience. Salary: 25,000 - 50,000 + Incentive. PRO (1) Female. Salary : 15,000 - 20,000. ✆ 98661 06265.

WE ARE HIRING 05 Executives, (01) Team Leader for Field Recovery Collection in Banking Process in Tirupati & Kadapa. Experienced Candidates Required in Collection Field. Cell: 99639 59854.

SUDHAHA LITTLE CITIZENS High School Invites Part Time Experienced Teachers for Telugu. Interested Candidate may walk-in- to School Campus or Cont: ✆ 75868 98050.

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పెషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. ✆ 89776 39662, 89776 39663.

VSN ఎంటర్‌ప్రైజెస్. మేనేజర్ (exp.

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సందాని

సీఎం చంద్రబాబుని కలిసిన సందాని

కార్వేటినగరం, న్యూస్‌టుడే: మంగళగిరిలో తెదేపా ముస్లిం మైనారిటీ సెల్ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి సందాని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్వేటినగరం మండల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు.

తైక్వాండోలో బంగారు పతకం

యాదమరి, న్యూస్‌టుడే: తైక్వాండోలో 155 కమ్మపల్లి యువకుడు బంగారు పతకం సాధించాడు. గోవాలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2024లో తిరుపతి భవానీ నగర్ ప్రతిభ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్నారు.

అమ్మవారికి విశేష పూజలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: బోయకొండ గంగమ్మ దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. శక్తి స్వరూపిణికి విశేషాలంకరణ చేశారు. ఆలయంలో అమ్మవారిని దర్శనం చేసుకోవడానికి భక్తులు బారులు దీరారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

చేనేత సంచుల్ని పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు కలసిరావాలని భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, మాజీ ఎంపీ దుర్గ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు పక్షోత్సవాలు, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక మార్కెట్ వద్ద ప్రజలకు చేనేత సంచుల్ని పంపిణీ చేశారు.

శిబిరంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ప్రముఖులు, పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు

మెగా ఉచిత వైద్యశిబిరం

నగరి, న్యూస్‌టుడే: పీసీఎన్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం, చెన్నైకు చెందిన రాజ్యలక్ష్మి గ్రూప్ మెడికల్ కళాశాల సంయుక్తంగా ఆదివారం పాఠశాల ఆవరణలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 600 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మెరుగైన పౌరసేవలే లక్ష్యం

● అడవిపల్లె ప్రాజెక్టు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
● ఆక్రమణల నివారణ, పచ్చదనం పెంపు
● 'న్యూస్‌టుడే'తో నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: పౌరులకు మెరుగైన సేవలే లక్ష్యమని చిత్తూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. నగర అభివృద్ధితో పాటు పౌరులకు నగరపాలక సంస్థ ద్వారా అందించనున్న సేవలపై 'న్యూస్‌టుడే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

పెండింగ్ పనుల పురోగతి

అడవిపల్లె ప్రాజెక్టు నుంచి నగరానికి తాగునీటిని అందించడానికి అవసరమైన పనులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టు నుంచి 0.785 టీఎంసీల నీటి ఉప సంహరణ, ఇంటెక్‌వెల్ అనుమతి కోసం జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నుంచి ప్రభుత్వానికి లేఖ పంపాల్సి ఉంది. పూతల పట్టులోని రంగంపేట క్రాస్ నుంచి చిత్తూరు నగరానికి 18 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ వేయడానికి ఎన్‌హెచ్‌శాఖ అనుమతి నిరాకరించగా.. ఉన్నతాధికారులతో చర్చించనున్నాం. దామలచెరువులోని పుదిపట్లబైలులో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి తిరుపతి ఆర్డీవో, పాకాల తహసీల్దార్‌తో సంప్రదిస్తాం.

సేవలకు ప్రాధాన్యం

నగర ప్రజలకు పౌరసేవల్ని నిర్దిష్ట వ్యవధిలోనే అందిస్తాం. నగరపాలక ఉద్యోగులకు ఈ-ఆఫీస్, ఈఆర్‌పీపై కెపాసిటీ బిల్డింగ్ పెంపొందించి సేవల్లో జాప్యం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణపై తనిఖీలు చేస్తాం. రోజూ ఒక్కో విభాగానికి సంబంధించిన ఉద్యోగులతో కార్యాలయంలో సమీక్షలు నిర్వహించి వారి పరిధిలో సక్రమంగా విధుల నిర్వహణపై ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నాం.

ప్రజారోగ్యం..పారిశుద్ధ్యం నిర్వహణ

వర్షపు నీరు కాలువల్లో కలవనీయకుండా మురుగు బయటకు పంపించే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాం. దీనికోసం నిర్దేశించిన ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణం ప్రక్రియ భూసేకరణ దశలో ఉన్నాయి. ప్రతి రోజు ఇంటింటా చెత్త, వ్యర్థాల సేకరణ సజావుగా నిర్వహించడానికి 'శానిటేషన్ ఆడిట్ టీమ్' ఏర్పాటు చేయనున్నాం. నగరపాలక కంపోస్టు యార్డులో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసి.. వ్యర్థాల నిర్వహణలో మార్పులు తీసుకొస్తాం.

ఆలస్యాన్ని అధిగమిస్తాం

ఇంటింటా చెత్త సేకరణలో ఆలస్యాన్ని గుర్తించాం. వాహనాలు మరమ్మతుకు గురవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. చెత్త సేకరణ వాహనాల నాణ్యతపై ఇప్పటికే తనిఖీలు నిర్వహించాం. దీనికోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నాం. తోపుడు బండ్లు, డంపర్ బిన్ల సంఖ్య పెంచుతాం.

ఉద్యాన వనాల్లో పచ్చదనం పెంపు

ప్రధాన కూడళ్లలో పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నాం. ప్రహరీలపై స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన చిత్రాలు గీయిస్తాం. ఉద్యానవనాల్లో పచ్చదనంతో ఆహ్లాద వాతావరణాన్ని కల్పించడానికి చర్యలు చేపడతాం. మినీ ఉద్యానవనాలు ఏర్పాటు, కాలుష్య నివారణకు కృషి చేస్తాం.

ఆక్రమణలపై చర్యలు

నీటి వనరులు, నగరపాలక స్థలాల్లో ఆక్రమణలు గుర్తించి స్వాధీనం చేసుకుంటాం. ప్రధాన రహదారుల్లో దుకాణాల ఆక్రమణలు తొలగించే ప్రణాళిక ఉంది. అనధికారిక భవనాల నిర్మాణం చేపట్టే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలకు పూనుకుంటాం.

ముగురు తొలగింపు

స్పందనకు వందనం

పుత్తూరు, న్యూస్‌టుడే: చౌటూరులో ముగురు తొలగించరూ శీర్షికన స్థానికుల సమాచారంతో ఈనెల 23న కథనం ప్రచురితం అయ్యింది. ఈ కథనానికి స్పందించిన మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందితో మున్సిపల్ అధికారులు తొలగించారు. పట్టణ పరిధిలోని జెండామాను ఎక్స్‌టెన్షన్ వీధిలో పిచ్చి మొక్కలు తొలగించరూ శీర్షికన ఈనెల 23న స్థానికుల సమాచారంతో కథనం ప్రచురితం అయ్యింది. ఈ కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు పిచ్చి మొక్కలు తొలగించారు.

మొగిలి ఘాట్ రోడ్డుపై స్పీడ్‌గన్ వాహనంతో సీఐ శ్రీనివాసులు

మొగిలి ఘాట్ రోడ్డుపై ప్రమాదాల నివారణ

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిపై మొగిలి ఘాట్ రోడ్డుపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఘాట్ రోడ్డుపై ఆదివారం ఆయన స్పీడ్‌గన్ వాహనం ద్వారా వాహనాల వేగాన్ని పరిశీలించి ఎక్కువ వేగంతో వచ్చిన వాహనాలకు ఆయన నేతృత్వంలో పోలీసులు జరిమానా వేసినట్లు చెప్పారు. ఈ జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు జిల్లా అధికారుల ఆదేశాలతో స్పీడ్ గన్ వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులను అప్రమత్తం చేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయ ఆటల పోటీలు

జావెలిన్ త్రోలో పాల్గొన్న ఉపాధ్యాయిని

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు తరగతి గదులకే పరిమితం కాకుండా ఆటవిడుపుగా ఆటల పోటీలు నిర్వహించినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. స్థానిక మెసానికల్ మైదానంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఉపాధ్యాయులకు క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, అథ్లెటిక్స్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆరోగ్యకరంగా తయారై విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు దోహదపడుతుందని చెప్పారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, రెడ్డప్పనాయుడు, దీనావతి, సరిత పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు ఎంపిక

చిత్తూరు(సంతపేట): జైన్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జైన్ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 190 మంది పరీక్షలు చేసుకోగా, 80 మంది శస్త్రచికిత్సకు ఎంపికయ్యారు. వీరికి తిరుపతిలోని ఎస్వీ అరవింద కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నట్లు సంఘ కార్యదర్శి సుభాష్‌జైన్ తెలిపారు. ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్ పాల్గొన్నారు.

నేత్ర ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మాట్లాడుతున్న సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం, న్యూస్‌టుడే: నేత్ర ఆరోగ్యంపై అందరికీ శ్రద్ధ అవసరమని సీఐ హనుమంతప్ప అన్నారు. బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో తిరుపతి అరవింద్ ఆసుపత్రి, స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డైట్ అధ్యాపకులు చెంగల్రాజు మాట్లాడుతూ కంటి వైద్య శిబిరంలో 230మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, 57మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. భాస్కర్‌రాజు, ఏఈవో హేమాద్రి, దిలీప్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయింపు

నింద్ర: మహిళా సంఘాల సభ్యులపై కేసు నమోదు చేయాలని వికలాంగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉమాపతిపిళ్లై డిమాండ్ చేశారు. ఈనెల 21న ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. జేఏసీ అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు శివకుమారి, రమేష్, జయరామనాయుడు పాల్గొన్నారు.

సూచిక... తికమక

చిత్తూరు-పుత్తూరు మార్గంలో కొత్తపల్లెమిట్ట వద్ద ఏర్పాటుచేసిన సూచిక బోర్డు తికమకగా ఉంది. ఈ మార్గంలో రహదారి విస్తరణ సమయంలో ర.భ. అధికారులు గ్రామాలు, పట్టణాలకు దారులు సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. అందులో ఎస్సార్‌పురం మండలం కొత్తపల్లెమిట్ట సమీపంతో చిత్తూరు వైపు వెళ్లే మార్గంలో ఏర్పాటుచేసిన బోర్డు తికమకగా ఉంది. ఇక్కడ తిరుపతికి ఎడమ వైపునకు వెళ్లాలని సూచిక బోర్డులో ఉంది. అయితే కొత్తపల్లెమిట్ట నుంచి తిరుపతికి వెళ్లాలంటే కుడి వైపునకు వెళ్లాల్సి ఉంటుంది. ర.భ.శాఖ డీఈఈ దస్తగిరి వివరణ కోరగా సూచిక బోర్డులు మార్పునకు నిధులు లేవని ప్రభుత్వం నిధులు రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- న్యూస్‌టుడే, పెనుమూరు

స్తంభం ఒరిగి.. ప్రమాదం పొంచి

పురపాలిక పరిధిలోని చౌటూరు గ్రామం సమీపంలోని రైతు పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. విద్యుత్తు స్తంభం ఓ వైపునకు ఒరిగిపోయింది. ఎక్కడో మారుమూల ప్రాంతం అయితే ఫర్వాలేదు గాని రోడ్డుకు సమీపంలోనే ఉంది. ఈ స్తంభంకు సమీపంలోనే విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ స్తంభం పడిపోతే ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదం జరగక ముందే విద్యుత్తుశాఖ అధికారులు వాటిని సరి చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పుత్తూరు**

ప్రతి మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే ధామస్‌ను సన్మానిస్తున్న నాయకులు

పాలసముద్రం, న్యూస్‌టుడే: అన్ని మండలాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ధామస్ పేర్కొన్నారు. ఆదివారం మండల నాయకులు ఎమ్మెల్యేను చెన్నైలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాలు పేదలకు అందేలా ప్రతి కార్యకర్త ప్రజల మధ్యలో ఉండాలన్నారు. ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి అందించారు. శేఖర్‌రాజు, విజయకుమార్, రవినాయుడు పాల్గొన్నారు.

బదిలీలు సాధారణం.. సేవలు చిరకాలం

బదిలీపై వెళ్తున్న పోలీసులను సన్మానిస్తున్న ఎస్సై భారతి, సిబ్బంది

పాలసముద్రం, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు సహజమని వారు చేస్తున్న సేవలే చిరకాలంగా నిలుస్తుందని ఎస్సై భారతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐలు చక్రవర్తి, మురుగేష్, రమేష్, ఢిల్లీ, మహేష్ కానిస్టేబుల్ ఘనంగా సన్మానించి మాట్లాడారు. విధి నిర్వహణలో ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారని, ఉత్తమ పనితీరు కనబర్చి తనకంటూ ప్రత్యేక స్థానం నిలుపుకున్నారన్నారు. ఏఎస్ఐలు రవి, లక్ష్మీ, ఖాదర్‌భాషా, బోస్, రమేష్ పాల్గొన్నారు.

మురికివాడల శుభ్రతపై దృష్టి సారించండి

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలోని మురికివాడలపై కమిషనరు ప్రత్యేక దృష్టి సారించి, మౌలిక వసతుల కల్పనకు చొరవ తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ కోరారు. స్థానిక మంగసముద్రంహౌసింగ్‌కాలనీ నగర శాఖ సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ చిత్తూరు నగరపాలక సంస్థలోని 50 డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. దోమలబెడద, పరిశుభ్రత వేధిస్తోందన్నారు. మణి, శ్రీనివాసులు, దాసరి చంద్ర, రమాదేవి, లతారెడ్డి, గిరిజ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

సన్మానం పొందుతున్న ఎంపీడీవో పీఎంఆర్ ప్రభాకర్ దంపతులు

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు అన్నారు. పాకాల ఎంపీడీవో పీఎంఆర్ ప్రభాకర్ సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఆదివారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సన్మానం జరిగింది. సీఈవో మాట్లాడుతూ ప్రభాకర్ పంచాయతీరాజ్‌లో వివిధ కేడర్లలో పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్నారని చెప్పారు. ఎంపీడీవో దంపతులను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్జీవోల సంఘం నాయకులు సన్మానించారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ..

చిత్తూరు (జిల్లా పంచాయతీ): చిత్తూరు నగరానికి చెందిన వ్యాపారవేత్త డాక్టర్ రూపేష్ బాబు ఆధ్వర్యంలో పూజిత వాటర్ ఫ్రంట్ ఆసోసియేషన్ సహకారంతో ఆదివారం విజయవాడలోని భరత్‌నగర్‌లో వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. చీరలు, దుప్పట్లు, ప్యాంటు, షర్టులను బాధితులకు అందజేసినట్లు బాబు తెలిపారు.

స్థలాల్ని ఆక్రమించే కుట్ర..

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తమ ఇంటి స్థలాల్ని ఆక్రమించేందుకు కొందరు కబ్జాదారులు కుట్ర చేశారని చిత్తూరు నగరానికి చెందిన బాధితులు ఆరోపించారు. స్థానిక ఇరువారం సమీపంలోని పోతంబట్టు మార్గంలోని వారి స్థలాల వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. తాము సర్వే సంఖ్యలు 263, 263-4, 266-1లో ఇంటి స్థలాలను 2010లో స్థలాల్ని కొనుగోలు చేశామన్నారు. వాటిని కొందరు స్థలాలకు దారి లేకుండా ప్రహరీ నిర్మించారని వాపోయారు. దీనిపై ప్రశ్నించగా.. మీ స్థలాలు ఇక్కడ లేవని దౌర్జన్యం చేశారని వాపోయారు.

నగదు అందజేస్తున్న దాత

బాధితురాలికి రూ.50 వేల ఆర్థిక సాయం.. పుత్తూరు: నందిమంగళం దళితవాడకు చెందిన చిరంజీవులు, నదియా దంపతుల కుమార్తె మోక్షిత (6) లివర్ వ్యాధితో బాధపడుతూ చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తమ కుమార్తె ఆరోగ్యం కోసం దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని ఆమె సోషల్‌మీడియా ద్వారా వేడుకున్నారు. నగరి పట్టణానికి చెందిన థాసన్ అమృతరాజ్ ఆదివారం రూ.50 వేలు అందజేశారు.

1న సమరసత యాత్ర.. పుత్తూరు: పుత్తూరులో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో అక్టోబరు 1న మంగళవారం శ్రీవారి గొడుగుల సమరసత యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ఆర్టీఎం రైల్వే గేటు నుంచి 9 గంటలకు ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. అంబేద్కర్ సర్కిల్, కాపువీధి, బజారువీధి మీదుగా సుబ్రమణ్యం స్వామి ఆలయం వరకు ఊరేగింపు సాగుతుందన్నారు. శ్రీశివానంద స్వామి(రాచపాళెం), శ్రీకైలాసనందగిరి స్వామి(కైలాసకోన), శ్రీకృష్ణ చైతన్య స్వామి(రాజులకండ్రిగ) హాజరవుతారన్నారు.

సభ్యుల సహకారంతో అభివృద్ధి.. పలమనేరు: బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్‌ను మరింత అభివృద్ధి చేయడానికి సభ్యుల సహకారం తీసుకుంటానని సంస్థ నూతన అధ్యక్షులు ఆర్వీబాలాజీ అన్నారు. ఆదివారం సూపర్‌బజార్ ఆవరణలో నిర్వహించిన 50వ వార్షిక మహాజన సభలో ఆయన పాల్గొన్నారు. సూపర్‌బజార్ 2023-24 సంవత్సరానికి రూ.24.81 కోట్ల అమ్మకాలు చేపట్టి రూ.1.06 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు చెప్పారు. ప్రస్తుతం 14,083 మంది సభ్యులతో రూ.34.59 కోట్లు షేర్ ధనం నిలువ ఉన్నట్లు వివరించారు.

పోషకాలు దండిగా.. ఆరోగ్యం మెండుగా

నెలాఖరు వరకు పౌష్టికాహార మాసోత్సవాలు

పూతలపట్టులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నిర్మల

తవణంపల్లె, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవితకు పునాదులు. బాలబాలికలకు విద్యతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇందుకు గుడ్లు, పాలు, బాలామృతం వంటి పౌష్టికాహారం అందజేస్తారు. గర్భిణులు, బాలింతలకు బాలసంజీవిని పేరుతో ఖర్జూరం, బెల్లం, వల్లీలు, రాగిపిండి, అటుకులు ఇస్తున్నారు. 7 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులకు బాలామృతం అందిస్తున్నారు. పౌష్టికాహారంతో పాటు 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన జరుగుతుంది. చిన్నారులను మానసికంగా, శారీరకంగా, విద్యాపరంగా దృఢంగా చేయడమే లక్ష్యం.

కేంద్రాల్లో సంబరాలు

సమాజంలో గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారు. సమతులఆహారం తీసుకోనందున తల్లీబిడ్డల ఆరోగ్యం దుష్ప్రభావం చూపుతోంది. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో నెలాఖరు వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

శక్తి నిచ్చేవి : ధాన్యాలు, వరి, గోధుమ, జొన్న మొదలైనవి. వీటిలో పిండి పదార్థాలు ఉండటం వలన మన శరీరానికి కావలసిన శక్తి వీటి ద్వారా లభిస్తుంది.

పెరుగుదల నిచ్చేవి: పప్పు ధాన్యాలు, మాంసం, చేపలు, జీడిపప్పు, బాదం పప్పు, మొదలైన ఆహార పదార్థాల్లో మన శరీర పెరుగుదలకు కావలసిన ప్రోటీన్లు ఎక్కువగా లభిస్తాయి.

రక్షణ ఇచ్చేవి: శరీరం వ్యాధుల బారిన పడకుండా, వచ్చినా తట్టుకునే శక్తి కావాలంటే విటమిన్లు చాలా అవసరం. ఆకుకూరలు, పండ్లలో లభిస్తాయి. వీటిపై పౌష్టికాహార మాసోత్సవాల్లో అవగాహన కల్పిస్తారు.

ప్రాజెక్టు పరిధిలో..: ఐరాల ప్రాజెక్టు పరిధిలో తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు మండలాలున్నాయి. తవణంపల్లె-74, ఐరాల-76, పూతలపట్టు-63 మొత్తం 213 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో గర్భిణులు 703, బాలింతలు 685, 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు చిన్నారులు 3,666, 3 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులు 2,543 మంది ఉన్నారు.

అమ్మఒడిలా నిర్వహణ..: చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అమ్మఒడి లాంటివి. రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేందుకు కేంద్రాలు విశేషంగా కృషి చేస్తున్నాయి. మెనూ ప్రకారం పోషకాహారం అందిస్తున్నాం. తల్లుల్లో రక్తహీనత, చిన్నారులు ఆరోగ్యంగా ఉండటానికి తమవంతు కృషి చేస్తున్నాం. **- నిర్మల, సీడీపీవో**

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

విద్యార్థులకు తాగునీటి కష్టాలు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధి సి.బండపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. వాటిలో 330 మంది విద్యార్థులు ఉన్నారు. మూడు విద్యాసంస్థల సౌకర్యార్థం దాతలు తవ్వించిన తాగునీటి పథకం బోరు ఇటీవల ఎండిపోయింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు నామాలప్ప తెలిపారు. నీటి ఎద్దడి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి హరీష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జానకిరామన్ తెలిపారు.

నేడు పురపాలక సమావేశం

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక పుర పాలక కార్యాలయంలో సోమవారం ఉదయం కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని ఛైర్మన్ ఆలీంబాషా ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

వీకేజీలకు మరమ్మతులు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి పొరకుంట్ల పల్లి గ్రామంలో తాగునీటి సరఫరా పైపులైన్లకు మరమ్మతు చేశారు. మురుగులో కలుషితమవుతున్న విషయంపై మేమున్నాం... మీకుతోడుగాలో 19న వార్త ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి సురేష్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ చర్యలు చేపట్టారు.

పారిశుద్ధ్య చర్యలు

స్పందనకు వందనం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి నెక్కుంది పంచాయతీ ఇటుక నెల్లూరు గ్రామంలో ఆదివారం సర్పంచి నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బసవరాజ మురుగునీటి కాలువలు, రోడ్లపై ఉన్నత చెత్త, వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. 9న వచ్చిన వార్తకు వారు స్పందించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ వంగసానివారిపల్లెలో మురుగుకాలువ పూడి, పిచ్చిమొక్కలు పెరిగి పారిశుద్ధ్యం అధ్వానంపై నెల21న ఈనాడులో ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మణి మురుగు కాలువను జేసీబీ సాయంతో శుభ్రం చేసేందుకు చొరవ తీసుకొన్నారు.

ఆర్థిక లోటు ఉన్నా సూపర్ సిక్స్ పథకాల అమలు

మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అంచెలంచెలుగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రోజురోజుకు ప్రజాబలం పెరుగుతోందని నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పుంగనూరులో ఓ ప్రైవేటు రెస్టారెంట్ ప్రారంభం, మేకనజామనపల్లెలో అమ్మవారి జాతరలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లోనే వంద ప్రజాసంక్షేమ, అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో దిక్కుతోచక వైకాపా నాయకులు అర్థరహిత విమర్శలు చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు వెంకటమునియాదవ్, ఆర్వీటీ బాబు, మాధవరెడ్డి, రమేష్‌రెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, జనసేన నాయకులు పగడాల రమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం నిర్వహించే పురపాలక కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని ఎస్‌డీపీఐ నాయకుడు యూసూఫ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో తలెత్తుతున్న తాగునీటి సమస్య, ప్రధాన కూడలిల్లో బస్‌స్టాప్‌లు, మరుగుదొడ్లు, నక్కబండలో నెలకొన్న కాలువల సమస్యలను పరిష్కరించాలన్నారు. పట్టణంలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు, కోతుల నివారణ, వీధిదీపాల ఏర్పాటు, నాటుసారా , గంజాయి నివారణపై దృష్టి పెట్టాలన్నారు.

రెడ్డివారిపల్లెలో నిరుపయోగంగా ఉన్న చెత్తసంపదం కేంద్రం

అలంకారప్రాయం సంపద ఉత్పత్తి కేంద్రాలు

నిర్లక్ష్యంతో నిర్వీర్యం

సదుం, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రారంభించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు నేడు అలంకారప్రాయంగా మారాయి. 2014 అప్పటి తెదేపా ప్రభుత్వం పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇళ్ల నుంచి వచ్చే తడి, పొడి వ్యర్థాలను వేరుచేసి వర్మీ కంపోస్టు తయారుచేసే ఉద్దేశంతో వీటికి నిధులు సమకూర్చింది.

మండలం	పంచాయతీలు	మొత్తం కేంద్రాలు	ఉపయోగంలో ఉన్నవి
పుంగనూరు	23	19	01
చౌడేపల్లె	14	14	00
సోమల	15	14	00
సదుం	18	16	00
పులిచర్ల	25	25	04
రొంపిచర్ల	10	10	00
మొత్తం	95	78	05

సదుం ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేయకుండా మూలకు చేరిన చెత్తడబ్బాలు

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని నిర్వీర్యం చేసింది. సదుం మండల పరిధిలో 18 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో షెడ్డుకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు చేసింది. ఇళ్ల నుంచి చెత్త సేకరణకు వీలుగా ప్లాస్టిక్ డబ్బాలు ప్రభుత్వం మంజూరు చేసినా ఇంతవరకు పంపిణీ చేయలేదు. మండల పరిషత్ కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్నాయి.

- షెడ్ల నిర్మాణం పూర్తి చేసి ఏళ్ల గడుస్తున్నా ఖాళీగానే ఉన్నాయి. ఎక్కడా ఎరువు తయారు చేస్తున్న దాఖలాలు లేవు. కొన్ని చోట్ల సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించకుండా రహదారుల పక్కనే పడేస్తున్నారు. సదుంలో సేకరించిన చెత్తను నడిగడ్డ రహదారి మార్గంలో వేస్తున్నారు. దీంతో చెత్తకు నిప్పు పెట్టినపుడు వచ్చే పొగతో పాడచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెరుకువారిపల్లె, నడిగడ్డ, బూరగమంద, రెడ్డివారిపల్లెలోని చెత్తసంపద కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి.

వినియోగంలోకి తీసుకువస్తాం

గ్రామాల్లోని చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఈ విషయం గ్రామ కార్యదర్శులకు తెలియజేశాం. అసంపూర్తిగా ఉన్న షెడ్లను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చూస్తాం.

- వరప్రసాద్, ఈవోపీఆర్డీ, సదుం

అక్రమ గ్రానైట్ ద్వారా రూ.5.25 లక్షల ఆదాయం

గుడుపల్లె, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం గుడుపల్లె పోలీస్ యంత్రాంగం సీజ్ చేసిన అక్రమ గ్రానైట్ అక్రమార్కులకు నుంచి రూ.5.25 లక్షలు జరిమానా సొమ్మును ప్రభుత్వ ఆదాయానికి జమచేసినట్లు గుడుపల్లె ఎస్సై డి.శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ రవాణ అరికట్టే క్రమంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో తనిఖీలు చేపట్టి మూడు గ్రానైట్ లారీలు, ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేసి పలమనేరు ఏడీ మైన్స్, ఎంవీఐ అధికారులకు చర్యలు నిమిత్తం అప్పగించడం జరిగింది. నాలుగు వాహనాలకు సంబంధించి వారి నుంచి రూ 5.25 లక్షల సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ చేశామని వివరించారు.

ఇద్దరు విద్యార్థులకు డాక్టరేట్ ప్రదానం

ఎం.చంద్రశేఖర్, ఎస్.కార్తీక్

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఇద్దరు విద్యార్థులకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నాగేశ్వరరావు తెలిపారు. వృక్షశాస్త్రం పరిశోధక విద్యార్థి ఎం.చంద్రశేఖర్‌కు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ నాగేశ్వరరావు తెలిపారు. వృక్షశాస్త్రం సహాయ ఆచార్యులు డి.శ్రీప్రియ పర్యవేక్షణలో 'న్యూట్రాస్యూటికల్ యాక్టివిటీ ఆఫ్ సెలెక్టెడ్ ఎత్నోబోటానికల్ సోస్టమ్ ఆఫ్ రాయలసీమ డిస్ట్రిక్ట్స్' అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించగా డాక్టరేట్‌ను అందించినట్లు ఆయన తెలిపారు. అలాగే తమిళశాఖలో పరిశోధన విద్యార్థి ఎస్.కార్తీక్ తమిళశాఖ ఆచార్యులు మరియప్పన్ పర్యవేక్షణలో 'ద్రావిడ భాషల తొలి వ్యాకరణ గ్రంథాలు' అంశంపై సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథానికి పీహెచ్‌డీ పట్టాను అందించినట్లు వివరించారు.

సభ్యుల సహకారంతో అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వీబాలాజీ

పలమనేరు: బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్‌ను మరింత అభివృద్ధి చేయడానికి సభ్యుల సహకారం తీసుకుంటానని సంస్థ నూతన అధ్యక్షులు ఆర్వీబాలాజీ అన్నారు. ఆదివారం సూపర్‌బజార్ ఆవరణలో నిర్వహించిన 50వ వార్షిక మహాజన సభలో ఆయన పాల్గొన్నారు. సూపర్‌బజార్ 2023-24 సంవత్సరానికి రూ.24.81 కోట్ల అమ్మకాలు చేపట్టి రూ.1.06 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు చెప్పారు. ప్రస్తుతం 14,083 మంది సభ్యులతో రూ.34.59 కోట్లు షేర్ ధనం నిలువ ఉన్నట్లు వివరించారు. సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుని సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. ప్రస్తుతం సభ్యులకు ప్రతియేటా వెండి నాణేం డివిడెంటు కింద ఇస్తున్నారని దాని స్థానంలో గృహోపకరణాలు ఇవ్వాలని సభ్యులు కోరారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు చద్రశేఖరరెడ్డి, సత్యమూర్తి, శ్రీరాములరెడ్డి, శీనప్ప, ఆశ్రఫ్‌అలీ, రవి, జగదీష్‌కుమార్, సెల్వరాజ్ పాల్గొన్నారు.

పెరుగుతున్న విష జ్వరాలు

పారిశుద్ధ్యం, అవగాహన లోపమే కారణం

వి.కోట, న్యూస్‌టుడే: నియోజకవర్గ వ్యాప్తంగా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో చిన్నారుల నుంచి పెద్దల వరకు మంచాన పడుతున్నారు. పారిశుద్ధ్యం, జ్వరాలపై అవగాహన లోపంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో చాలా మంది చిన్నారులు ఇటీవల మృత్యువాతపడ్డారు.

మృత్యువాత: వి.కోట మండలం సత్యసాయినగర్‌కు చెందిన హరిబాబు కుమార్తె మేఘన(13), బాపూజీ పీడికి చెందిన పాతిమ(6) డెంగీతో మృతి చెందగా, బైరెడ్డిపల్లె మండలం నాగిరెడ్డిపల్లెలో పదేళ్ల బాలుడు పీఈఎస్‌లో చికిత్స పొందుతూ విషజ్వరంతో ఇటీవల మృతి చెందారు.

ఆసుపత్రులు కిటకిట: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వి.కోటలోని ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి రోజూ దాదాపు 500 మంది రోగులు వస్తున్నారు. కొద్ది రోజులుగా రోగుల రాక పెరిగింది. అంటు వ్యాధులు పెరగడానికి పారిశుద్ధ్యం, రోగాలపై అవగాహనా లోపమే కారణం అని వైద్యులు అంటున్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు

వి.కోట మండల కేంద్రంలో ప్రతి రోజు దోమలు నివారణ కోసం ఫాగింగ్ ఏర్పాటు చేస్తున్నాం. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- శివశంకర్, పంచాయతీ ఈవో

మురుగు, చెత్తతో అధ్వానంగా గంగమ్మ ఏరు

వర్షపు, మురుగు నీరు నివాస ప్రాంతాల్లో నిల్వ ఉండకుండా చూడాలని, దోమ తెరలు, వేప ఆకుతో పొగ పెట్టుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ప్రభుత్వ వైద్యులు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

పుదిపట్లలో పూర్వ విద్యార్థుల బృందం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పుదిపట్ల(చౌడేపల్లె), న్యూస్‌టుడే: మండలంలోని పుదిపట్ల ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అక్షరాలు నేర్చుకున్న బడిలో ఒక్కటయ్యారు. 34 ఏళ్ల తరువాత కలిసిన వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠాలు చెప్పిన గురువులకు సన్మానించారు.

అమ్మవారికి విశేష పూజలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: బోయకొండ గంగమ్మ దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. శక్తి స్వరూపిణికి విశేషాలంకరణ చేశారు. ఆలయంలో అమ్మవారిని దర్శనం చేసుకోవడానికి భక్తులు బారులు దీరారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

కట్టకిందపాళ్యంలో ఊరేగింపులో పాల్గొన్న స్థానికులు

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 7న వినాయక చవితి సందర్భంగా నెలకొల్పిన వినాయక ప్రతిమల్లో కుమ్మరవీధి, కట్టకిందపాళ్యంకు చెందిన వినాయకుల విగ్రహాలను ఆదివారం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. యువత డప్పుల వాయిద్యాలకు నృత్య ప్రదర్శనలు చేస్తూ ఊరేగించి నిమజ్జనం చేశారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను గౌరవించాలి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో తల్లి దండ్రుల పట్ల గౌరవ మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని పాస్టర్ రాకేష్ నిమ్రోద్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రవికుమార్, కోశాధికారి సురేష్ క్రిష్టఫర్, సభ్యులు దేవప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేక మృతి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మేకపై కుక్కలు దాడిచేసి చంపిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు మేరకు.. పట్టణ సమీపంలో పాత సామాన్లు విక్రయిస్తున్న రహ్మత్ రెండు మేకలను మేపుకుంటున్నాడు. ఇంటి ముందు కట్టేసిన మేకపై కుక్కలు దాడిచేశాయి. మృతి చెందిన మేక సుమారు రూ.20 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

కృష్ణాజమ్మకుంటలో నీరులేకపోవడంతో వినాయక విగ్రహాలను అలాగే వదిలేసిన దృశ్యం

చెరువుల్లో నీరులేక.. నిమజ్జనం కాక

సోమల, న్యూస్‌టుడే: ఇటీవల తీవ్ర వర్షాభావంతో వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో, కుంటల్లో నీరు లేవు. దాంతో వినాయక చవితి పండుగ తర్వాత వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నీరులేక మండలంలోని నంజంపేట సమీపంలోని కృష్ణాజమ్మకుంటలో తూముల వద్ద వినాయకస్వామి ప్రతిమలు పెట్టేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా శ్రీకారు ఎంటర్‌ప్రైజెస్ శ్రీరాం ఫైనాన్స్ V.Kota Branch Manager వారు చద్దిన బోగస్ ప్రకారం ఈ క్రింది కనిన షెడ్యూల్ దాఖల స్థిరాస్తి 1. Sri K.Bhaskar Reddy, S/o K.Ramakrishna Reddy, 2. Sri K.Gnanendra Kumar, S/o K.Bhaskar Reddy, Both are residing at Door No.5-31/1, Thathi Reddipalli Village, Podda Challaragunta Post, Baireddipalli Mandal, Chittoor District, A.P. గార్ల కి చెందిన స్థిరాస్తి, సదరు ఆస్తి తిరస్కరణ తనఖా చేయుంబడును సదరు 1.Sri K.Bhaskar Reddy, S/o K.Ramakrsihna Reddy, 2. Sri K.Gnanendra Kumar, S/o K.Bhaskar Reddy గార్ల కి రుణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. దానన సదరు వ్యవహారము సంబంధించి ఈ క్రింది కనిన షెడ్యూల్ ఆస్తులపై ఎటువంటి అప్పులు, చార్జీలు, వైనులు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు ఉన్నచో లిఖితపూర్వకముగా దస్తు వివరములతో నేటి నుండి 7 దినములలోగా క్రింది చిరునామాకు ప్రాతఃకార్యకలాపముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములు లేవు నా దృష్టికి రాదు అన్నట్లు భావిస్తాను.

SCHEDULE OF PROPERTY

Chittoor District, Palamaner Sub-District - Chittoor Zilla Parishad - Baireddipalli Mandal and Madal Parishad, Podda Challaragunta Grama Panchayath, Podda Challaragunta Revenue Village, 6th Ward, Thathireddipalli Village grama Kantam bearing Sy.No. 190 in this RCC house bearing Door No.5-31/1, Measuring: East - West - 38 Ft or 7.010 Mtrs, North - South - 38 Ft or 11.582 Mtrs. Total 874 Sq Ft or 97.11 Sq Yards. SITUATE WITHIN THE FOLLOWING BOUNDARIES: East: C.C.Road. West: House of Bharathamma, North: House of Siva Kumara. South: Rajakaluva.

Sd/- K.Lakshmipathy, B.Com.,LL.B., Advocate, Palamaner. Mobile: 7013127065, 9440569356

రుణాలు సద్వినియోగం

ఆర్థికంగా రాణిస్తున్న మహిళలు

సోమల, న్యూస్‌టుడే: మహిళ సంఘాల సభ్యులు తీసుకొన్న రుణాలను సద్వినియోగం చేసుకొని వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ రుణాలను సక్రమంగా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మహిళలు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల ద్వారా దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు ప్రారంభించారు. వ్యాపారాలను వృద్ధి చేసుకుంటూ కుటుంబ పోషణలో తమవంతు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతేకాకుండా పిల్లల చదువుకు ప్రోత్సాహం అందిస్తూ ఉన్నత చదువులు చదివేలా చర్యలు చేపడుతున్నారు.

- మండల కేంద్రమైన సోమలకు చెందిన శ్రీనివాసకుమార్ భార్య రెడ్డి రాణి 15 ఏళ్ల కిందట శ్రీకనకదుర్గ మహిళ సంఘంలో సభ్యురాలుగా చేరి ఆరు సార్లు బ్యాంకు ద్వారా రుణం తీసుకుంది. ఆ రుణాన్ని తన భర్త సహకారంతో హార్డ్‌వేర్ దుకాణాన్ని ప్రారంభించింది. అందులో వచ్చే ఆదాయంతో రుణం సకాలంలో చెల్లిస్తూ తమ ఇద్దరి పిల్లలను ఉన్నత చదువులు చదివించింది.

- నంజంపేటకు చెందిన మౌల భార్య ఖమ్రున్‌బీ ఎనిమిదేళ్ల క్రితం గాయత్రి మహిళ సంఘంలో సభ్యురాలుగా చేరింది. భర్త చిన్న వ్యాపారంతో పాటు వ్యవసాయం చేస్తుండగా ఆమె తన వంతు సాయంగా దర్జీ పనులు చేస్తోంది. బ్యాంకు నుంచి మూడు సార్లు రుణం తీసుకొని వ్యాపారంలో పెట్టుబడి పెట్టింది. ఆదాయం పొందుతూ కుటుంబ పోషణలో తనవంతు సహకారం అందిస్తోంది.

- సోమలకు చెందిన భార్య బాలాజీ చెప్పుల దుకాణం, బుక్ షాప్ తదితర వస్తువుల విక్రయ దుకాణం నిర్వహిస్తున్నాడు. భార్య అనితలక్ష్మి శ్రీ వాసవీ మహిళ సంఘంలో సభ్యురాలిగా చేరింది. బ్యాంకులో తీసుకొన్న రుణాలు చెల్లించడమే కాకుండా కుటుంబానికి తనవంతు సహకారం అందించాలని ఉద్దేశంతో చిల్లర దుకాణం, ఫ్యాన్సీ స్టోర్ నిర్వహిస్తూ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి సహకారం అందిస్తోంది.

రోడ్లు, కాలువలు జలమయం

పట్టణంలోని మినీ బైపాస్‌రోడ్డులోని వివేకానంద కాలనీలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు, కాలువలు జలమయమవుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లు, కాలువలు పొంగిపోయాయి. నీరు బయట పోవడానికి మార్గం లేక ఇళ్లలోకి వచ్చాయి. దీంతో పాములు ఇళ్లలోకి చేరాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మురుగు, వర్షపునీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు

అరాచకాలకు అడ్డాగా చెత్త సంపద కేంద్రం

మండలంలోని భీమగానిపల్లె పంచాయతీలోని చెత్త సంపద కేంద్రం అరాచకాలకు అడ్డాగా మారింది. చెత్త సంపద కేంద్రంలో మద్యం, పేకాటరాయుళ్లకు నిలయంగా మారింది. మద్యం సేవించి అక్కడ నిర్మించిన తొట్టెలను పగుల గొడుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయమై ఈవోఆర్డీ నారాయణను న్యూస్‌టుడే వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: రోడ్డుపక్కన నడిచి వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. తులసమ్మగుడి సమీపంలో జాతీయ రహదారి పక్కన నడిచి వెళుతున్న రాజేంద్రనాయుడిని వీఏకొత్తూరు గ్రామానికి చెందిన విజయకుమార్ ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తలకు, కాలికి గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంలో ఉన్న ముగ్గురు కూడా కిందపడిగాయపడ్డారు. వీరిని 108అంబులెన్స్ ద్వారా పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేంద్రనాయుడి పరిస్థితి విషమంగా ఉండడంతో సీఎంసీ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి బెంగళూరులోని సైనిక ఆస్పత్రికి తరలించారు. రాజేంద్రనాయుడి అన్న కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపంజాణి పోలీసులు తెలిపారు.



చీకట్లో ప్రమాదకర ప్రయాణం

కృష్ణగిరి-పలమనేరు జాతీయ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు కుప్పం మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కుప్పం బైపాస్ మార్గంలో వీధి దీపాలు లేక పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కూడలి నుంచి శెట్టిపల్లె కూడలి వరకు, ఆస్పత్రి కూడలి నుంచి విజలాపురం రోడ్డు కూడలి వరకు వీధి దీపాలు లేక చీకట్లు కమ్ముకున్నాయి. - న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

బాలిక అదృశ్యం

పుంగనూరు గ్రామీణ: పట్టణంలోని యూబీ కాంపౌండ్‌లోని అజ్మతుల్లా కుమార్తె అస్రీయ అంజుమ్మ్ (7) ఆదివారం రాత్రి ఇంటి ఎదుట ఆడుకుంటూ ఉంది. కొద్దిసేపటికి తర్వాత కనబడకుండా పోయింది. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఇళ్లల్లో, వీధుల్లోనూ, బంధువుల ఇళ్లల్లో వెతికిన ఆచూకీ దొరకలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తండ్రి అజ్మతుల్లా తెలిపారు.